సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 8 । డిసెంబర్ । 2024





ఉప్పొంగిన క్రీడోత్సాహం

కైలాసగిరిలోని పోలీస్ పరేడ్ మైదానంలో అఖిల భారత పబ్లిక్ బస్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థల అథ్లెటిక్ మీట్ ఉత్సాహంగా సాగుతోంది.

8లో



ఈత పోటీల్లో అదరగొట్టారు 8లో

ఆవిష్కరణలతో నూతన శకం

- డిజిటల్ రంగంలో నైపుణ్యత పెంపొందించుకోవాలి
- ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యాన్
- ఘనంగా ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సావనీర్ విడుదల చేస్తున్న ఎల్అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యాన్, మంత్రి లోకేష్, జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

విశాఖ విద్య: యువత ఆవిష్కరణలకు సిద్ధం కావాలని ఎల్అండ్‌టీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యాన్ పిలుపునిచ్చారు. ఏయూ కన్వెన్షన్ హాలులో శనివారం జరిగిన ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యాన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ రంగంలో వస్తున్న మార్పులు నూతన అవకాశాలకు నాందిగా నిలుస్తాయన్నారు. డిజిటల్ రంగంలో యువత నైపుణ్యత పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చన్నారు. కొన్ని దేశాల్లో వలసలు పెరిగిపోతున్నాయని, భారత్‌లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. ప్రస్తుతం భారత్ ఆర్థికవృద్ధి బాగుండడమే ఇందుకు కారణమన్నారు. అదే సమయంలో నిర్మాణ రంగంలో కార్మికుల కొరత కూడా భారత్‌లో అధికంగా ఉందన్నారు.

ఏయూలో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

రాష్ట్ర మానవ వనరులు శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఏయూకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విభిన్న రంగాల్లో ఏయూ పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలు.. వర్సిటీ వేసిన బలమైన పునాదికి నిదర్శనమన్నారు. ఉన్నత విద్యలో మెరుగైన ఎకోసిస్టమ్ నిర్మించడానికి పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తామన్నారు. పాఠ్యాంశాలను ఆధునికీకరిస్తామని, యూనివర్సిటీల్లో దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ భర్తీకి చర్యలు చేపడతామని, ఉన్నత విద్యా సంస్థల అభివృద్ధికి అందుబాటులో ఉన్న నిధులను వినియోగిస్తున్నామన్నారు. ఏయూలో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణరావు ప్రసంగాన్ని ఆయన సతీమణి డాక్టర్ శశిప్రభ చదివి వినిపించారు. కార్యక్రమంలో భాగంగా అతిథులను పూర్వ విద్యార్థుల సంఘం తరపున సత్కరించారు. అల్యూమిని మీట్–2024 సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఇ.ఎన్ ధనంజయరావు, రెక్టార్ ఎన్ కిశోర్‌బాబు, పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ ఈ.శంకరరావు, వైస్ చైర్మన్ కుమార్ రాజా, సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలకు సిద్ధం కండి

ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గ్రంధి మల్లికార్జునరావు మాట్లాడుతూ 2025లో ఏయూ శతాబ్ది ఉత్సవాలకు సిద్ధం కావాలన్నారు. దేశ నిర్మాణానికి అవసరమైన విభిన్న రంగాల నిపుణులను ఏయూ అందించిందన్నారు.



అలరించిన నృత్యరూపకం

పూర్వ విద్యార్థులకు ఏదీ మర్యాద!

కలెక్టర్‌ను సైతం పట్టించుకోని ఏయూ అధికారులు

ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులకు తగిన గౌరవం దక్కలేదనే విమర్శలు వినిపించాయి. ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ సమ్మేళనంలో వర్సిటీ అధికారులు అతిథుల సేవలో తరించారు. వేదికపై నిర్వాహక కమిటీ సభ్యులకు తప్ప.. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులకు తమ అనుభవాలను పంచుకునే అవకాశం లభించకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా వర్సిటీ నుంచి వివిధ వర్గాల వారికి పాసులు జారీ చేసినప్పటికీ, కన్వెన్షన్ హాలులో చాలా మందికి కూర్చొనేందుకు అవకాశం లేకపోవడంతో నిల్చొని కార్యక్రమాన్ని వీక్షించాల్సి వచ్చింది. కాగా.. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హరేందిర ప్రసాద్ హాజరయ్యారు. కానీ ఆహ్వాన కమిటీ కలెక్టర్‌ను వేదికపైకి ఆహ్వానించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కలెక్టర్ పూర్వ విద్యార్థులతో కలిసి కూర్చొన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం అయినప్పటికీ.. జిల్లా మేజిస్ట్రేట్ హోదాలో కలెక్టర్‌కు తగిన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని, ఆ విషయాన్ని నిర్వాహకులు విస్మరించడం తగదని పలువురు అభిప్రాయపడ్డారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును వేదికపై ఆహ్వానించిన నిర్వాహకులు.. కార్యక్రమానికి హాజరైన మిగతా ఎమ్మెల్యేలను పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది.



పూర్వ విద్యార్థులతో కలిసి కూర్చున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ప్లాస్టిక్ రహిత విశాఖ మన లక్ష్యం

స్వచ్ఛ విశాఖ అంబాసిడర్ ఆర్.పి.పట్నాయక్





అధికారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్వచ్ఛ విశాఖ అంబాసిడర్, సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్

ఏయూక్యాంపస్: విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడం మనందరి లక్ష్యం కావాలని, సమష్టి కృషితోనే ఇది సాధ్యమని సంగీత దర్శకుడు, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్ ఆర్.పి.పట్నాయక్ అన్నారు. శనివారం జీవీఎంసీ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో మత్స్యదర్శిని సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్‌లతో కలిసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు నిషేధంపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పర్యావరణహితంగా, పరిశుభ్రతతో కూడిన నగరమన్నారు. ఈ నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తయారు చేసి ఆదర్శంగా నిలపాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా సముద్ర జీవులు, మూగ జీవాలకు సైతం హాని కలుగుతుందన్నారు. నగరంలో జనవరి 1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించడం జరుగుతోందని, దీనికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. పట్టుదలతో చేస్తే తప్పకుండా రాదా ఫలితం సోదరా అంటూ గీతాన్ని సైతం ఆలపించారు. అనంతరం బీచ్ పరిసరాల్లో జీవీఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి వ్యర్థాలను ఏరివేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు ఎం.వి.వి.ఫణిరామ్, కె.శివప్రసాద్, ఎం.మల్లయ్య నాయుడు, సహాయ వైద్యాధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు, జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి

కలెక్టర్ హరేందిర ప్రసాద్

నరవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన 'మెగా పేరెంట్స్, టీచర్స్' ఆత్మీయ సమావేశంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు కష్టపడి విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కుర్చీలు లేవని తరగతి గదికి తాళాలేశారు..

ఎన్ఎంసీహెచ్ ఉపాధ్యాయుల అతి ఆలస్యంగా మధ్యాహ్నం భోజనం

8లో



తరగతి గదికి తాళాలు వేసిన వైనం

సముద్ర గర్భంలో యోధ.. సబ్‌మెరైన్

నేడు జలాంతర్గాముల దినోత్సవం

- తూర్పు ఆసియాలో తొలి జలాంతర్గామి మ్యూజియం కురుసుర
- తొలి జలాంతర్గామి కల్వరి రెక్కభాగం కూడా విశాఖలోనే..



ఐఎన్ఎస్ కల్వరి

ఏయూక్యాంపస్: సముద్ర గర్భంలో యుద్ధం చేసే అత్యంత శక్తివంతమైన యుద్ధనౌకలు సబ్‌మెరైన్లు. కంటికి కనిపించకుండా శత్రువులను ఛేదించి, వారిపై దాడి చేయగల సామర్థ్యం వీటి సొంతం. భారత దేశంలో తొలి సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ కల్వరి. భారత నౌకాదళంలోకి 1967 డిసెంబర్ 8న కల్వరి ప్రవేశించింది. రష్యాలోని రిగాలో మైనస్ 15 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ఈ చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఐఎన్ఎస్ కల్వరి కమాండర్‌గా కె.ఎస్ సుబ్రహ్మణియన్ వ్యవహరించారు. దీని గుర్తుగా ఏటా డిసెంబర్ 8న జలాంతర్గామి దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఐఎన్ఎస్ కల్వరి సబ్ మెరైన్‌కు చెందిన రెక్క భాగాన్ని విశాఖ మ్యూజియంకు వెళ్లేదారిలో.. బీచ్‌రోడ్డులో 1998లో ఏర్పాటు చేశారు. భారత దేశ నావికా సంపత్తిలో కీలక ఘట్టానికి సాక్షిగా నిలిచిన ఈ జలాంతర్గామి.. నేటికీ యువతకు స్ఫూర్తిని నింపుతూ సగర్వంగా నిలుస్తోంది.

నేటి కార్యక్రమాలు : నేవీ బ్యాండ్ ప్రదర్శన
వేదిక : ఐఎన్ఎస్ కురుసుర మ్యూజియం
సమయం : సాయంత్రం 5.15 గంటల నుంచి

2002 నుంచి సందర్శనార్థం

తూర్పు ఆసియాలో తొలి సబ్‌మెరైన్ మ్యూజియంగా భారత్‌కు సేవలందించిన కురుసుర నిలిచింది. ఇందుకు విశాఖ వేదికగా నిలవడం గర్వకారణం. కురుసుర సబ్‌మెరైన్ 1969 డిసెంబర్ 18న భారత్ నౌకాదళంలోకి చేరింది. 2001 ఫిబ్రవరి 27 వరకు సేవలందించింది. ఈ సబ్‌మెరైన్‌ను మ్యూజియం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వచ్చిన తర్వాత అనేక సవాళ్లు ఎదురయ్యాయి. సబ్‌మెరైన్‌ను ముక్కలుగా విడదీసి ఇక్కడ అమర్చాలనే ప్రతిపాదనను పక్కనపెట్టి, అదే ఖర్చుతో నేరుగా తీరానికి చేర్చాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియలో భారీ టగ్‌ల సాయంతో సబ్‌మెరైన్‌ను తీరానికి తీసుకువచ్చారు. భారీ హైడ్రాలిక్ యంత్రాలు, ఇనుప గొలుసులను ఇందుకు ఉపయోగించారు. ఆ సమయంలో సబ్‌మెరైన్ ముందు భాగం ఇసుకలో కూరుకుపోయింది. ఇందుకోసం ఎంతో శ్రమించి పరిష్కారం చూపారు. ఒక వైపునకు ఒరిగిపోకుండా.. రెండు వైపులా ఎత్తుగా ఇసుక మేటలు వేసి ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేశారు. సబ్‌మెరైన్ ఏర్పాటు చేయడానికి వీలుగా భారీ కాంక్రీట్ ఫౌండేషన్ నిర్మించి దీనిపైకి హైడ్రాలిక్ జాక్స్‌తో చేర్చారు. తుపానులు, భారీ గాలులు వీచినా తట్టుకునే విధంగా సపోర్టింగ్ వ్యవస్థను నిర్మించారు. సబ్‌మెరైన్‌కు మూడు పొరలు పెయింటింగ్ పనులు పూర్తి చేసి 2002 ఆగస్టు 9న మ్యూజియంను ప్రారంభించారు. అదే సంవత్సరం ఆగస్టు 14 నుంచి సందర్శనార్థం ప్రజలకు అనుమతించారు.



కురుసుర మ్యూజియం

నగదు కాజేసి.. బెట్టింగ్ అప్లికేషన్‌లో జమ చేసి..

సైబర్ ముఠాకు సహకరిస్తున్న ముగ్గురి అరెస్ట్

- లోన్ ఇస్తామని అమాయకులను దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లు
- కాజేసిన నగదును బెట్టింగ్ అప్లికేషన్ వాలెట్‌లోకి జమ
- నగదు బదిలీకి సహకరిస్తున్న బెట్టింగ్ అప్లికేషన్ ఫ్రాంఛైజీ గ్యాంగ్



విశాఖ సిటీ: నిషేధిత బెట్టింగ్ అప్లికేషన్ నిర్వహిస్తూ.. నకిలీ లోన్ నిర్వాహక ముఠాకు సహాయం చేస్తున్న మోసగాళ్లకు సైబర్ క్రైం పోలీసులు చెక్ పెట్టారు. బెట్టింగ్ అప్లికేషన్ ఫ్రాంచైజీ తీసుకున్న వ్యక్తితో పాటు అతని సహాయకులిద్దరిని శనివారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన శరగడం మోహనరావు అనే వ్యక్తి తన వ్యక్తిగత అవసరాల కోసం రుణం తీసుకోడానికి ఆన్‌లైన్‌లో పలు అప్లికేషన్లను పరిశీలించాడు. ఇందులో ఇండియన్ బుల్స్ అనే అప్లికేషన్‌లో తన వ్యక్తిగత వివరాలు, మొబైల్ నంబర్‌ను నమోదు చేశాడు. కొద్దిసేపటికే నకిలీ లోన్ కంపెనీ అయిన ఇండియన్ బుల్స్ ప్రతినిధుల నుంచి మోహనరావుకు కాల్ వచ్చింది. లోన్ ఇస్తామని చెప్పి నమ్మించారు. అయితే డాక్యుమెంటేషన్, ఎన్‌వోసీ, జీఎస్టీ చార్జీల పేరుతో కొంత నగదు జమ చేయాలని చెప్పారు. వారి మాటలు నమ్మిన మోహనరావు దఫదఫాలుగా రూ.3.42 లక్షలు నేరగాళ్లు చెప్పిన ఖాతాలోకి జమ చేశాడు. అయినప్పటికీ తనకు లోన్ రాకపోవడంతో మోసపోయానని గ్రహించి వెంటనే సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతికత సహాయంతో దర్యాప్తు చేపట్టగా.. విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి కాజేసిన నగదును దేశంలో నిషేధించిన దుబాయ్‌కు చెందిన స్పింటర్ ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ అప్లికేషన్ ఖాతాలోకి బదిలీ చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వాస్తవానికి ఈ బెట్టింగ్ అప్లికేషన్ వాలెట్‌లోకి నగదు జమ చేయాలంటే.. ఆ బెట్టింగ్ అప్లికేషన్‌ను ఫ్రాంచైజీ తీసుకున్న వారి సహాయం అవసరం. ఈ కోణంలో దర్యాప్తు చేయగా విజయవాడకు చెందిన పొట్టి శివ పాండురంగారావు బెట్టింగ్ ఫ్రాంచైజీని కలిగి ఉన్నట్లు తెలుసుకున్నారు. అతను సైబర్ నేరగాళ్లతో సంప్రదింపులు జరిపి.. బాధితుల నుంచి కాజేసిన నగదును బెట్టింగ్ అప్లికేషన్ వాలెట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాడు. ఆ తర్వాత ఆ నగదును నేరగాళ్ల గేమింగ్ వాలెట్ ఐడీలోకి జమ చేస్తున్నాడు. అనంతరం నేరగాళ్లు విత్‌డ్రా రిక్వెస్ట్ పెట్టుకుని.. వారికి కావాల్సిన ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. పాండురంగారావు ఈ బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహించడం కోసం డబ్బులు అవసరమున్న రకరకాల వ్యక్తులను సంప్రదిస్తున్నాడు. వారితో ఖాతా ఓపెన్ చేయించి.. వారికి కొంత నగదు ఇచ్చి వారి పేర్ల మీద అకౌంట్లు నిర్వహిస్తూ బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. నేరగాళ్లు వివిధ వ్యక్తుల నుంచి సేకరించిన 6 మ్యూల్ ఖాతాలు పరిశీలించగా సుమారు రూ.20కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇందులో కమిషన్ రూపంలో నిందితులకు రూ.80 లక్షల వరకు గత ఏడాదిన్నర కాలంలో వచ్చినట్లు ఆధారాలు సేకరించారు.

రుషికొండలో ముగ్గురు అరెస్ట్

బెట్టింగ్ అప్లికేషన్ ఫ్రాంచైజీ తీసుకున్న విజయవాడకు చెందిన పొట్టి శివపాండురంగారావు, అతనికి సహాయకులుగా పనిచేస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలానికి చెందిన ఈరె గోవిందకుమార్, బాపట్ల జిల్లా రేపల్లె మండలానికి చెందిన పట్టంశెట్టి వెంకట సాయి మణికంఠను సైబర్ క్రైం పోలీసులు రుషికొండ వద్ద ఓ హోటల్‌లో అరెస్ట్ చేశారు. వారి నుంచి బెట్టింగ్ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్న 9 సెల్‌ఫోన్లు, 2 ల్యాప్ టాప్‌లు, రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	: రూ.90
బ్రాయిలర్ (లైవ్)	: రూ.112
స్కిన్	: రూ.190
స్కిన్‌లెస్	: రూ.200

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)	
విశాఖ	610.00
విజయనగరం	614.00
శ్రీకాకుళం	614.00

సాగరతీరంలో స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం



ఫ్రీస్టయిల్‌లో పోటీపడుతున్న బాలుడు



బ్యాక్‌స్ట్రోక్ చేస్తున్న స్విమ్మర్

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర్ జిల్లాల సబ్ జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ శనివారం సాగర తీరంలోని ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభమైంది. జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో మూడు ఏజ్ గ్రూప్‌ల్లో ఫ్రీస్టయిల్, బాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై, వ్యక్తిగత మెడ్లే అంశాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. వాటర్ పోలోతో సహా మొత్తంగా 45 అంశాల్లో పోటీలు నిర్వహించి.. సాధించిన రికార్డుల ఆధారంగా రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తామని సంఘ కార్యదర్శి మోహన్‌రామ్ తెలిపారు. ముందుగా ఈ పోటీలను విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్ నాయుడు ప్రారంభించారు. అనంతరం పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు.

22న విశాఖ-బనారస్ రైలు రద్దు

తాటిచెట్లపాలెం: రాంచీ డివిజన్, సోరంటోలి చౌక్ స్టేషన్ పరిధిలో ఆధునికీకరణ పనుల నేపథ్యంలో ఈ నెల 22వ తేదీన విశాఖపట్నం–బనారస్(18311) ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 23వ తేదీన బనారస్– విశాఖపట్నం(18312) ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ప్రయాణికులు మార్పులను గమనించాలని రైల్వే అధికారులు సూచించారు.

మధ్యవర్తిత్వం.. సత్వర పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: ఇరువర్గాలు మధ్య మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పిలుపునిచ్చారు. జిల్లా కోర్టులోని న్యాయవాదులకు మధ్యవర్తిత్వ విధానంపై శనివారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. విదేశాల్లో 90 శాతం కేసులు మధ్యవర్తిత్వం ద్వారా రాజీ అవుతున్నట్లు చెప్పారు. ఈ పద్ధతిని మన దేశంలో కూడా ఉపయోగించుకుంటే పెండింగ్ కేసుల సంఖ్య భారీగా తగ్గుతుందన్నారు. 2013లో అమల్లోకి వచ్చిన కుటుంబ న్యాయస్థానం చట్టంతో మధ్యవర్తిత్వం ద్వారా పలు వివాదాలు పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు. ఇందుకు సంబంధించి పలు కేసులను ఉదహరించారు. పని ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులు గురికాకుండా.. మహిళల రక్షణ చట్టం –2013లోని వివిధ అంశాలను విపులంగా వివరించారు. కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం మాట్లాడుతూ కుటుంబ వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మాత్రమే శిరోధార్యమన్నారు. న్యాయవాదులందరూ మధ్యవర్తిత్వ విధానంలో మెలకువలు తెలుసుకుని.. రాజీ చేసుకోవాలని సూచించారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ మాట్లాడుతూ మధ్యవర్తిత్వ ప్రక్రియ ద్వారా కేసులు రాజీ చేసుకుంటే.. న్యాయస్థానాలకు పని భారం తగ్గుతుందన్నారు. ఏఏ కేసులు మధ్యవర్తిత్వంలో పరిష్కరించుకోవచ్చో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ వివరించారు. జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, కార్యదర్శి నరేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



సాయిగీత (ఫైల్)

కశింకోట: తండ్రిని చూసేందుకు వెళ్తూ మండలంలోని నరసింగబిల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. విశాఖ నుంచి యలమంచిలి వైపు వెళుతున్న స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని కింద పడింది. దీంతో స్కూటీ నడుపుతున్న విశాఖలో ఓ హార్డ్‌వేర్ దుకాణంలో పనిచేస్తున్న ఇనుపకుర్తి సాయిగీత(35) తీవ్రంగా గాయపడింది. ఆమెను హైవే అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. యలమంచిలిలో ఉన్న తన తండ్రి వెంకటరమణను చూసేందుకు వెళుతూ ప్రమాదానికి గురైంది. ఆమె భర్త ఏడాది కిందట మరణించాడు. వీరి ఒక కుమార్తె ఉంది. తల్లి మృతితో ఆమె అనాథ అయింది. సీఐ అల్లు స్వామినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుర్చీలు లేవని తాళాలేశారు



భోజనం కోసం వేచి చూస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: విశాఖలోని నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (ఎన్ఎంసీహెచ్) ఉపాధ్యాయులు తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఓ వైపు పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ.. మరోవైపు కొంతమంది విద్యార్థులను తరగతి గదుల్లో పెట్టి తాళాలు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు అడుగులు' పేరుతో రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం పీఅండ్‌టీ కాలనీలో ఉన్న ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో సమావేశాన్ని చేపట్టారు. దీనికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

తరగతి గదులకు తాళాలు

ఆత్మీయ సమావేశం నిర్వహణలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించినప్పటికీ.. అందుకు తగ్గట్టుగా సీటింగ్ ఏర్పాట్లు చేయలేదు. ఇదిలా ఉంటే సీట్లు లేవన్న నెపంతో కొంత మంది విద్యార్థులను తరగతి గదుల్లో ఉంచేసి తాళాలు వేయడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా హాజరైనప్పటికీ.. ఈ సంఘటనపై స్పందించకపోవడం గమనార్హం.

తల్లిదండ్రుల ఆగ్రహం

విద్యార్థులను బంధించిన విషయంపై ఉపాధ్యాయులు చెప్పిన సమాధానానికి అందరూ విస్తుపోయారు. అందరికీ కుర్చీలు లేవని, అందుకే విద్యార్థులను గదుల్లో పెట్టి తాళాలు వేశామని చెప్పడాన్ని తల్లిదండ్రులు తప్పుబట్టారు. ఈ సమావేశానికి సక్రమంగా ఏర్పాట్లు చేయకుండా కార్యక్రమాన్ని నిర్వహించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు 'పిల్లల బంగారు భవిష్యత్తు కోసం' అంటూ కార్యక్రమాలు నిర్వహిస్తూ.. వారిని బంధించడం సమంజసం కాదని హితవుపలుకుతున్నారు.

భోజనం ఆలస్యం

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టే విషయంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సాధారణంగా ప్రతి రోజు విద్యార్థులకు మధ్యాహ్నం 12.30కి భోజనం పెట్టాల్సి ఉంది. కానీ శనివారం మాత్రం 1.15 దాటిన తరువాత భోజన ఏర్పాట్లు చేశారు. అప్పటి వరకు విద్యార్థులను తరగతి గదుల్లోనే బంధించి ఉంచారు. విద్యార్థులను కార్యక్రమానికి రాకుండా వంకలు చెప్పిన ఉపాధ్యాయులు కనీసం వారికి భోజన ఏర్పాట్లు కూడా దృష్టి పెట్టకపోవడం గమనార్హం.

ఉత్సాహంగా ఆర్టీసీ అథ్లెటిక్ మీట్

సత్తాచాటుతున్న రాష్ట్ర ఆర్టీసీ క్రీడాకారులు



1,500 మీటర్ల మెన్ పరుగు పోటీలు

విశాఖ స్పోర్ట్స్: అఖిల భారత పబ్లిక్ బస్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థల అథ్లెటిక్ మీట్ కైలాసగిరి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో రెండవ రోజు శనివారం ఉత్సాహంగా సాగింది. 50+, అండర్–50 కేటగిరీల్లో సూపర్‌వైజర్లు, అధికారులకు 1000 మీటర్ల ఫాస్ట్ వాక్ పోటీలు నిర్వహించారు. మెన్, వుమెన్‌కు లాంగ్‌జంప్, డిస్కస్ త్రో, 400 మీటర్ల ఫాస్ట్ వాక్, రిలే పరుగు పోటీలు నిర్వహించగా దేశంలోని 18 ఆర్టీసీ సంస్థ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండు రోజుల్లో ఏపీఎస్ఆర్టీసీ 14 పతకాలు, కేఎస్ఆర్టీసీ 8, తెలంగాణ ఆర్టీసీ 2, ఎంఎస్ఆర్టీసీ 10, గుజరాత్ ఆర్టీసీ 2, ఎన్‌డబ్ల్యూకేఆర్‌టీసీ 8, కేకే ఆర్టీసీ 4, ఉత్తరాఖండ్ 2, బెస్ట్(ముంబయి) ఆర్టీసీ 5, ఎంటీసీ చెన్నై 1, కర్ణాటక ఆర్టీసీ 2 పతకాలను సొంతం చేసుకున్నాయి. ఏపీఎస్ఆర్టీసీ, అసోసియేషన్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్న సంగతి తెలిసిందే.

రెండో రోజు పోటీల్లో విజేతలు వీరే..

మెన్ లాంగ్ జంప్‌లో కేశవ్ రాజేంద్ర(ఎంఎస్ఆర్టీసీ) 5.18 మీటర్లు దూకి విజేతగా నిలవగా, వుమెన్‌లో జయంతి(బీఎంటీసీ) 3.46 మీటర్లు దూకి విజయం సాధించింది. 50+సూపర్‌వైజర్స్‌కు నిర్వహించిన 1000 మీటర్ల ఫాస్ట్ వాక్‌లో ముకేష్ రాణా(ఉత్తరాఖండ్), ఆఫీసర్స్ కేటగిరీలో అండర్–50 వుమెన్ విభాగంలో చక్రతేజ(ఏపీఎస్ఆర్టీసీ), అండర్–50 ఆఫీసర్స్‌కు జరిగిన పోటీలో కె.రమేష్(ఏపీఎస్ఆర్టీసీ) విజేతలుగా నిలిచారు. 1,500 మీటర్ల మెన్ పరుగులో అతిష్ పటేల్ (జీఎస్ఆర్టీసీ), మెన్ డిస్కస్ త్రోలో వినాయక్ శశికాంత్(ఎంఎస్ఆర్టీసీ), వుమెన్‌లో లలితా రవి(ఎంఎస్ఆర్టీసీ) గెలుపొందారు. మెన్ 200 మీటర్ల పరుగులో విజయ్‌కుమార్(బీఎంటీసీ), వుమెన్‌లో ప్రతీక్ష సెలార్(బెస్ట్ ముంబయి) విజేతగా నిలిచారు. 50 ఏళ్లు దాటిన ఆఫీసర్స్ కేటగిరీలో మెన్ 400 మీటర్ల ఫాస్ట్‌వాక్‌లో చితవడేగప్ప(కేకేఆర్టీసీ), వుమెన్‌లో గౌరమ్మ(కర్నాటక ఆర్టీసీ) గెలుపొందారు. మెన్ 400 మీటర్ల రిలే పరుగులో బీఎంటీసీ, ఎన్‌డబ్ల్యూకేఆర్టీసీ, కర్నాటక ఆర్టీసీ జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

సాయుధ దళాల పతాక నిధికి కలెక్టర్ తొలి విరాళం



మాజీ సైనికుడు టి.కె.కృష్ణారావు దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా పతాక నిధికి కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తొలి విరాళం అందించారు. కలెక్టరేట్‌లో పతాక నిధి వేడుకలను శనివారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు, విద్యా సంస్థలు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలు పతాక నిధికి విరివిరిగా విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 90 ఏళ్ల మాజీ సైనికుడు టి.కె.కృష్ణారావు దంపతులను సన్మానించారు. జేసీ కె.మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ కూడా పతాక నిధికి విరాళాలు అందించారు. ఎయిర్ వెటరన్స్ అసోసియేషన్ పతాక నిధికి రూ.23 వేలు చెక్కును కలెక్టర్‌కు అందజేసింది. జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికంగా విశాఖకు గుర్తింపు



ప్రసంగిస్తున్న చిన్న జీయర్ స్వామి

సీతమ్మధార: విశాఖ ప్రాంతానికి ఆధ్యాత్మిక పరంగా ఎంతో విశిష్టత ఉందని అపర రామానుజులు, ఆధ్యాత్మిక ఆచార్యులు త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. శనివారం గీతా జయంతి వేడుకల ప్రారంభ సభలో ఆయన అనుగ్రహ భాషణం చేస్తూ విశాఖ ప్రాంత వైభవాన్ని వివరించారు. సాక్షాత్ ద్వయ రూపంలో శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి సింహాచల క్షేత్రంలో వెలసిన భక్తులను అనుగ్రహిస్తున్నారన్నారు. సాగర తరంగాలు గత వైభవాన్ని నేటికీ ప్రసరింపజేస్తున్నాయన్నారు. ఆ వైభవాన్ని సమాజానికి అందించడానికి విశాఖ సాగర తీరంలో వేద అధ్యయన, పరిశోధనా కేంద్రం (వారిజ) ఆశ్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేద స్వరం సాగర తరంగాల ద్వారా ఇతర ప్రాంతాలకు విస్తరింపజేస్తోందన్నారు. 20 ఏళ్ల క్రితం ఆరంభమైన ఈ పాఠశాల ద్వారా వేద విద్యను ఎందరో పూర్తి చేసుకున్నారని తెలిపారు. శ్రీభాష్యం అప్పలాచార్యులు, శాతులూరి గోపాల కృష్ణమాచార్యులు వంటి మహనీయులు ఆధ్యాత్మిక మార్గాన్ని అందిస్తున్నారన్నారు.

గంజాయి నిర్మూలనకు చర్యలేవి?



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సీతంపేట: అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా గంజాయిని నిర్మూలించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ విమర్శించారు. లలితా నగర్‌లోని ఆయన కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి పుష్కలంగా దొరుకుతోందని, దీనివల్ల యువత మత్తుకు బానిసై నేర ప్రవృత్తికి అలవాటుపడుతున్నారన్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో గంజాయి కోత కాలమని, పంట దిగుబడికి వచ్చే సమయమని, అటువంటి సమయంలో ప్రభుత్వం నిర్మూలన చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం ఈగల్‌ను ఏర్పాటు చేసినా క్షేత్ర స్థాయిలో సిబ్బందిని నియమించకపోవడం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. విచ్చలవిడిగా స్మగ్లర్లు ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలిస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే గంజాయి రహిత ఏపీగా మారుస్తామని చంద్రబాబు, అధికారంలోకి రాగానే 48 గంటల్లో గంజాయిని ఏరివేస్తామని పవన్ కల్యాణ్ మాట్లాడారని గుర్తు చేశారు. గంజాయి నిర్మూలనలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒక రోల్ మోడల్‌గా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు.

ఉత్కంఠగా దక్షిణ భారత చెస్ పోటీలు



ఎత్తుకు పై ఎత్తు వేస్తున్న క్రీడాకారులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ వేదికగా జరుగుతున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా చదరంగ పోటీలు రెండవ రోజు ఉత్కంఠగా కొనసాగాయి. మూడు రౌండ్ల పోటీల అనంతరం తమిళనాడు రాష్ట్రానికి చెందిన జట్లు బోర్డులపై తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ముందుకు దూసుకెళ్లాయి. తమిళనాడుకు చెందిన అన్నా యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, కర్ణాటకకు చెందిన విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ, ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయాల క్రీడాకారులు ఆరు పాయింట్లతో మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నారు.

ఆండాల్ అమ్మవారికి వెండి వాకిలి బహూకరణ



దేవస్థానం ఈవోకు వెండి వాకిలిని అందజేస్తున్న దాత గ్రంధి రాంజీ దంపతులు

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారి సన్నిధి ఇక నుంచి వెండి వాకిలితో దర్శనమివ్వనుంది. నగరంలోని పెదముషిడివాడకు చెందిన తిరుమల స్టీల్ ఎంటర్ ప్రైజస్ అధినేత గ్రంధి రాంజీ దంపతులు 28 కిలోల వెండి వాకిలిని అమ్మవారి సన్నిధికి తయారు చేయించి సింహాచలం దేవస్థానానికి బహూకరించారు. ఆలయానికి కుటుంబ సమేతంగా వచ్చిన దాత వెండివాకిలిని దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకు అందజేశారు. దాతకు స్వామివారి దర్శనాన్ని కల్పించి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని ఈవో అందజేశారు. దేవస్థానం మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు వంకాయల విజయనిర్మల, డిప్యూటీ ఈవో రాధ పాల్గొన్నారు.